క్లుప్తంగా

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నికల కన్న ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని చిన్నగొట్టిముక్ల బీఆర్ఎస్ నాయకులు నారాయణరావు, నర్సింగరావు, నరేందర్ ఆరోపించారు. అసెంబ్లీలో గవర్నర్‌తో రైతులకు సంబంధించి అబద్దాలు చెప్పించారని వాపోయారు. 3 ఎకరాల్లోపు రైతులకు రైతు భరోసా పూర్తిస్థాయిలో రాలేదని రుణమాఫీ కూడా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులకు సంబంధించి ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తి వేయాలి'



నర్సాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని నర్సాపూర్ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ శుక్రవారం రాస్తారోకో చేసి సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు శేఖర్, పట్టణాధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ.. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ విధించడం హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. ఆయనపై సస్పెన్షన్ ఎత్తి వేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యంగౌడ్, నర్సింలు, రాంచందర్, నర్సింగ్‌రావు, జ్ఞానేశ్వర్, నాగరాజుగౌడ్, షేక్ హుస్సేన్, మాణయ్య, ఇర్ఫాన్, విఠల్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయడం దారుణం..

కొండపాక(గజ్వేల్): ప్రజా సమస్యలను పట్టించుకోవాలంటూ మాట్లాడిన మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం దారుణమంటూ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మండల పరిధిలోని దుద్దెడలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, నాయకులు భాస్కర్, కనకసేన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. హామీలన్నీ నేరవేర్చామంటూ గవర్నర్ ప్రసంగంలో చెప్పడం దారుణమని, ఈ విషయాన్ని ప్రశ్నించినందుకు సభాహక్కులను కాలరాశారంటూ జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో రవీందదర్, లింగం, భాను, శ్యాం, మగ్దుమ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'పై' డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు

వర్గల్(గజ్వేల్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వర్గల్ పూలే మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా 'పై' డే నిర్వహించారు. 'పై' గుర్తు ప్రత్యేకత, గణితంలో దాని ప్రాముఖ్యత గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు విద్యార్థులకు వివరించారు. గణితంలో అంకెలు, గుర్తులకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. గణితాంశంతో కూడిన 'ట్రెజర్ హంట్' గేమ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరావు, ఏటీపీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి అన్నారు. గుడికందుల గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడికందుల మీదుగా వర్దరాజుపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.80కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ భైరాగౌడ్, నాయకులు ప్రకాశ్, సంతోష్, వెంకట్, రాములు, ఎల్లం పాల్గొన్నారు.

హోలీ.. రంగుల కేళి

హోలీ పండుగను చిన్నా.. పెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా జరుపుకొన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని వర్గాల ప్రజలు హోలీ వేడుకల్లో భాగంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పకున్నారు.



రామాయంపేటలో హోలీ ఆడుతున్న మహిళలు



శివ్వంపేటలో హోలీ వేడుకల్లో యువకులు



రామాయంపేటలో యువకుల సందడి



చిన్నశంకరంపేటలో..



కొడిపల్లిలో..



నర్సాపూర్ రూరల్: పండుగ సంబరాల్లో చిన్నారులు



నిజాంపేట(మెదక్): నందిగామలో..



నర్సాపూర్: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు, పెద్దలు



వెల్దుర్తి(తూప్రాన్): కొప్పులపల్లిలో సంబరాలు



టేక్మాల్(మెదక్): కాదులూర్‌లో..



అల్లాదుర్గంలో హోలీ సంబరాలు



చేగుంట గాంధీ చౌరస్తా వద్ద..



చేగుంటలో..



పెద్దశంకరంపేటలో..



తూప్రాన్‌లో ..



మనోహరాబాద్(తూప్రాన్): రంగాయిపల్లిలో..

యథేచ్ఛగా కలప అక్రమ వ్యాపారం

- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత
- ఇతర ప్రాంతాలకు వందల లారీల తరలింపు
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు



వెంకట్‌రావ్‌పేట గ్రామ శివారులో అక్రమ కలప దుంగలు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలో కలప అక్రమ వ్యాపారం అడ్డు అదుపు లేకుండా యథేచ్ఛగా కొనసాగుతోంది. పర్యవరణ పరిరక్షణ కోసం ఒక వైపు ప్రభుత్వం మొక్కలు నాటుతుంటే, మరో వైపు చెట్లను నరుకుతూ పర్యవరణానికి తూట్లు పొడుస్తున్నారు. అక్రమ కలప వ్యాపారాన్ని అరికట్టాల్సిన అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎండకాలం వచ్చిందంటే అక్రమ కలప వ్యాపారులకు పండగే. రెండు నెలలుగా వందల లారీల కలప అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఆటవీశాఖ అధికారులు పెద్ద ఎత్తున మాముళ్లు వసూలు చేస్తూ పోత్సహిస్తున్నారనే విమర్శలున్నాయి.

మండల పరిధిలోని వెంకట్‌రావ్‌పేట, రెడ్డిపల్లి, ముస్లాపూర్, బహిరన్‌దిబ్బ, చెవెళ్ల గ్రామాల్లో అక్రమ కలప వ్యాపారం చేపడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా.. వందలాది చెట్లను నరికి వేస్తూ లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెద్దశంకరంపేట సెక్షన్ పరిధిలో కొందరు ఆటవీ శాఖ అధికారుల అడ్డదండలతోనే ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందనే ఆరోపణలున్నాయి. రైతుల వ్యవసాయ భూముల్లో ఉన్న వేప చెట్లను నరికి వేస్తూ, ఒక ప్రాంతంలో నిల్వ చేసి రాత్రి వేళలో తరలిస్తున్నారు. వెంకట్‌రావ్‌పేట రోడ్డు పక్కనే చెట్లను నరికి దుంగలను నిల్వ చేశారు. ఆటవీ శాఖ అధికారుల అడ్డదండలతో చెట్టును నరుకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అక్రమ కలప వ్యాపారులు, ఆటవీ శాఖ అధికారులతో కుమ్మక్కయ్యారనే విమర్శలున్నాయి. అక్రమ కలపను అడ్డుకునేందుకు ఆటవీ శాఖ అధికారులు పెట్రోలింగ్ చేయాల్సి ఉన్నా.. గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెవెళ్ల గట్టుపై పెద్ద ఎత్తున చెట్లను నరికివేశారు. రెండు నెలల నుంచి వందల లారీ కలప అక్రమ రవాణా జరిగిందంటే ఆటవీ శాఖ అధికారుల విధులపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైన పర్యవరణాన్ని కాపాడేందుకు ఆటవీశాఖ అధికారులు అక్రమ కలప వ్యాపారులపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి రోడ్లకు మోక్షం..



ప్రారంభమైన భుజరంపేట రోడ్డు పనులు



మారనున్న చిన్నఘనాపూర్ - ఏడుపాయల రోడ్డు

రూ.9.50 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలంలో మట్టి రోడ్లకు మోక్షం లభించింది. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా ఈ పనుల కోసం రూ.9.50 కోట్లు వెచ్చించనున్నారు. వీటిలో ప్రధానమైనది మెదక్–జోగిపేట ప్రధాన రహదారి పీడబ్ల్యూడీ రోడ్డును కలుపుతూ చిన్న ఘనాపూర్ గ్రామ శివారులోని ఏడుపాయల కమాన్ నుంచి ఘనాపూర్ ఆనకట్ట వరకు 1.70 కిలో మీటర్ల రహదారి, ఇదే ప్రధాన రహదారిని కలుపుతూ కొడిపల్లి మండలం భుజరంపేట గ్రామ శివారు పల్లె గడ్డ గిరిజన తండా మీదుగా 4.65 కిలోమీటర్ల రహదారి, మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిని కలుపుతూ పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోని ఎంఎన్ కాల్వ దర్గా పక్క నుంచి ఘనాపురం ఆనకట్ట వరకు 2.30 కిలోమీటర్ల మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చే పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం రంగంపేట గ్రామ శివారును కలుపుతూ భుజరంపేట వరకు పల్లెగడ్డ తండా మీదుగా చేపట్టే రోడ్డు పనుల మరమ్మతులు ప్రారంభమయ్యాయి. మట్టి పోసే పనులు పూర్తవగా, కంకర పోసే పనులను చేపట్టారు. మిగతా రెండు రహదారుల పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ భరత్ కుమార్ తెలిపారు.

వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ అన్నారు. మూడో రోజుకు చేరుకున్న ఎమ్మార్పీఎస్ దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం చేసేంతవరకు ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేయొద్దని డిమాండ్ చేశారు. మాదిగల పోరాటం నిరుద్యోగులకు వ్యతిరేకం కాదని, ఉద్యోగాల భర్తీలో అన్ని కులాలకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశ్యమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లాస్ మాదిగ, నిర్మల్, ప్రభాకర్ శ్రీనివాస్, జైరాజ్, రాంచందర్, సుకుమార్, కిట్టు, ప్రశాంత్, ధన్‌రాజ్, రాకేశ్, అఖిల్, సందీప్, సతీశ్, సమృద్ధి, పవన్, అజయ్, ఏసురత్నం పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యమా?

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. అసెంబ్లీ నుంచి మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం గజ్వేల్‌లో ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలులో విఫలమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజమౌళి, జకీయొద్దీన్, నవాజ్‌మీరా, మధు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మహాత్ములు చూపిన మార్గంలో నడవాలి

జహీరాబాద్ టౌన్: మహాత్ములు చూపిన మార్గంలో నడుచుకోవాలని బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ పేర్కొన్నారు. ప్రథమ మహిళా జగద్గురు స్వర్గీయ మాతే మహాదేవి 79వ జయంతి వేడుకలను శుక్రవారం పట్టణంలోని బసవ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ పాటిల్ మాట్లాడుతూ... జగద్గురు మాతే మహాదేవి మాతాజీ జనన మరణం ఒకే రోజు కావడం విశేషమన్నారు. లింగాయత్‌ల అభ్యున్నతికి ఆమె ఎంతోగానో కృషి చేశారని, ఆమె అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

బగలాముఖీ శక్తిపీఠంలో పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో బగలాముఖీ అమ్మవారు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా పూజ మహోత్సవాలు చేశారు. బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



పందిట్లోకి అమ్మవారి స్వామి వారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



కల్యాణోత్సవంలో భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని తదితరులు కొలువైన భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ఉదయం స్థానిక మంజీరా నది నుంచి జలాలను తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రంగంపేట ఆశ్రమ పీఠంలోని వేద పాఠశాల విద్యార్థుల మంత్రోచ్చరణల మధ్య హోమం, పూర్ణాహుతి చేశారు. కల్యాణ వేడుకలకు సమీపంలోని హనుమాన్ మందిరం నుంచి స్వామివారి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పురోహితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం భక్తులు అమ్మవారికి ఓడిబియ్యం పోసి మొక్కులను సమర్పించుకున్నారు. అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అనంత పద్మనాభస్వామి జాతర



మైనంపల్లి హన్మంతరావును జ్ఞాపికను అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాపన్నపేట(మెదక్): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. అనంత పద్మనాభస్వామి జాతరలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మైనంపల్లికి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోవింద్, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేశ్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ మల్లప్ప, నాయకులు సత్యనారాయణ, సందీప్, సంతోష్‌గౌడ్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం చేరుకున్న పాదయాత్ర

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం శ్రీశైలంకు విజయవంతంగా చేరుకుంది. ఈ ఏడాది సుమారు 800మంది భక్తులతో పది రోజుల క్రితం పాదయాత్ర ప్రారంభించారు. 380 కిలో మీటర్ల వరకు పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తిరుగు ప్రయాణమవుతారని చెప్పారు.